

# తోడొకరుండిన....

- శారద పోలంరాజు



*(గత సంచిక తరువాయి)*

**చెదురుమదురుగా జనం** వున్నారు. లోపలి నుండి చిన్నగా ఏడుపు వినిపిస్తున్నది. "రండమ్మా." దారిలో వున్న వాళ్ళను తప్పించుకుంటూ అందరూ లోపలికి వెళ్ళారు. "మేరమ్మా, లూసి బేటి దోస్తులంట వచ్చిండ్రు."

బయటకు వచ్చిన ఆవిడ చాల దయనీయంగా కనిపించింది. ఏడ్చి ఏడ్చి మొహమంతా వాచిపోయి వుంది. "అమ్మలు మీరె కదమ్మ పూర్ణిమ, తరుణి, కుసుమ. లూసి మీ గురించి మస్తుగ చెప్పెడిది. బిడ్డా, అగో నీ దోస్తులచ్చిండ్రు. కల్లు తెర్వవే." ఎన్నో ఏళ్ళ నుండి పరిచయమున్నట్టు ఆమె పలుకరిస్తుంటే వాళ్ళకు ఏడుపు తన్నుకొచ్చింది.

"బిడ్డా, మీతోని చేరినంక నా బిడ్డ మంచిగయుండె కదమ్మా. ఆడెవడో మత్తుపెట్టి నా బిడ్డను పాడుచేసిండంట. ఆ ముచ్చట నాకు ముందే చెప్పుంటె నేనేదైన మంచి దవఖానకు తీస్క పోతుంటి కద. చూడుండ్రి బిడ్డా మీ దోస్తు నాకన్యాయం చేసి పోబట్టె."

ముగ్గురు మంచానికి అంటుకు పోయి వున్న లూసీ దగ్గరకువెళ్ళారు. కొన ప్రాణంతో వుంది. మెల్లిగా చేయి లేపి, "నాకెర్కనే. నేను చచ్చేలోపల మీ రెట్లయిన వస్తరని నాకెర్క. మీ కొరకె నేను ఇంక వున్న. కుస్మా, నువ్వు చెప్పిన మంచిమాటలు చెవికెక్కలే. అందు గురించె నే పోతున్ననే. అందరు మాట ముచ్చట తీసినప్పుడు నన్ను యాది చేసుకొండె." ఆయాసం ఎక్కువయింది.

అక్కడ వున్న పెద్దవాళ్ళకు అర్ధమయింది. "మేరీ, ఆ పిల్లలను పంపేయ్. ఇంక మనం బిడ్డ ఆత్మ శాంతి కొరకు ప్రార్ధన చేద్దాం". ఆడవారు కొంగులు తల మీద కప్పుకొని మంచం చుట్టూ మోకాళ్ళ మీదకూర్చున్నారు.

ఆయమ్మ వచ్చి, "రండి బిడ్డ ఇంక ఇళ్ళకు పోదురు." అంటు బయటకు తీసుకొచ్చింది.

"ఆయమ్మా, ఒక్క నిమిషం." అని పక్కన షాప్‌లోకి వెళ్ళి, "బాబూ మీ దగ్గర ఫోన్ వుంటే ఒక్క కాల్ చేసుకోనిస్తారా?" అంటూ దీనంగా ప్రార్ధించింది. షాప్ ఓనర్ ఫోన్ ముందుకు జరపంగానే, బాగ్‌లో నుంచి ఒక నోట్ బుక్ తీసి అందులో నుండి ఒక నంబర్ డయల్ చేసింది.

"అంకుల్.........."అంటూ వస్తూన్న ఏడుపును దిగమింగుకుంటూ విషయం వివరించి, "మీరే ఏదైనా చేసి లూసీని కాపాడాలి అంకుల్." అని అవతలి మనిషి చెప్పిన విషయం విని ఫోన్ పెట్టేసింది.

"ఎవరికి కుసుమా ఫోన్?"

"రేణుక వాళ్ళ నాన్న డాక్టర్ సురేంద్ర అంకుల్‌కు చెప్పాను. ఆయన అంబులెన్స్ పంపిస్తానన్నారు. అది వచ్చే వరకు మనము ఈ షాప్ పక్కనే వెయిట్ చేద్దాము."

"పాపలు రండమ్మా, మిమ్ములను బస్ స్టాప్ వరకు దింపుత." అక్కడే నిలబడ్డ ఆయమ్మ చెప్పింది. "అమ్మగారోల్లు మందికి ఎరుకైతె పరువు పోతదని దవఖానకు తీస్కపోలేదమ్మ. మీరెందుకు గా పోరి గురించి బుగులైతరు. ఇండ్లకు పోదురు తీయుండ్రి."

"లేదు ఆయమ్మ. లూసీకి హాస్పిటల్లో ట్రీట్‌మెంట్ ఇప్పిస్తే బాగవుతుందని నా నమ్మకం. అదిగో అంబులెన్స్ రానే వచ్చింది." ఒక్కడుగు ముందుకు వేసింది. వెనకనే కార్లో డాక్టర్ సురేంద్ర కూడా దిగి వీళ్ళున్న దగ్గరకు వచ్చాడు.

"మీరందరూ ఇక్కడే వున్నారని తెలిసి నేను స్వయంగా వచ్చాను. కుసుమా మీరు ఇళ్ళకు వెళ్ళండి. ఇంక నేను చూసుకుంటాను. కావాలంటే అందరూ తరుణి ఇంటి వద్ద వెయిట్ చేయండి. నేను అక్కడికి ఫోన్ చేసి లూసీకి ఎట్లా వుందో చెప్పుతాను." ఆయన పదేపదే భరోసా ఇచ్చేటప్పటికి ఇంటి ముఖం పట్టారు. సంగతి తెలిసి రేణుక కూడా వచ్చి చేరింది.

జరిగిన సంఘటన అందరికి తెలిసి పోలీసులు గొడవలు అవుతాయేమోనని భయపడి ఏ డాక్టర్‌కూ చూపించకుండా ఇంటివద్దే లూసీని వుంచి ఏడుస్తున్న లూసీ తల్లితండ్రులు అంబులెన్స్‌తో కూడా వచ్చిన ఆ పెద్ద డాక్టర్ను చూసిన తరువాత హాస్పిటల్‌కు పంపించటానికి ఒప్పుకున్నారు.

నాటు వైద్యం వల్ల విపరీతమైన రక్తస్రావం జరిగిన ఆమె గురించి డాక్టర్ సురేంద్ర ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రక్తం ఎక్కించి సరైన వైద్యం అందించాడు. దానితో ఆమె ప్రాణాపాయం నుండి బయటపడింది. కాని విపరీతమైన నీరసం వలన కోలుకోవటానికి బాగానే సమయం పట్టేటట్టున్నది.

ఈ విషయాలన్ని వివరంగా ఫోన్ చేసి చెప్పేవరకు స్నేహితురాళ్ళు ఏడుస్తూనే వుండిపోయారు.

గ్లోరియా ద్వారా క్లాస్ లో లెక్చరర్స్‌తో సహా అందరికీ జరిగిన సంగతి తెలిసింది. కుసుమ సమయస్ఫూర్తితో తీసుకున్ననిర్ణయం ఒక ప్రాణాన్ని కాపాడటం అన్నది సామాన్యమైన విషయమా! ప్రతి ఒక్కరూ కుసుమను మనసారా అభినందించారు.

కాలం దేని కోసం ఆగదు. ఎన్నెన్నో మార్పులు తెస్తూ కడలిలోని తరంగాలలా ఒడుదుడుకులను ఎదుర్కుంటూ సాగిపోతూనే వుంటుంది.

మృత్యుముఖం నుండి బయటపడ్డ లూసీ పూర్తి పశ్చాత్తాపంతో కుమిలి పోయింది. ఇంక కాలేజీ మొహం చూడటానికి ససేమిరా ఒప్పుకోలేదు. స్నేహితురాళ్ళు ఎంతగానో నచ్చ చెప్పారు. "కనీసం ప్రైవేట్‌గానైనా డిగ్రీ పూర్తి చేయమని సలహా ఇచ్చారు. కాని లూసీకి అన్నిటిమీద ఒక విరక్తిభావం కలిగింది.

ఒకనాడు తన నిర్ణయం తల్లితండ్రుల ముందు బహిర్గతం చేసింది. "మమ్మి, డాడీ. నా నుంచి మీకు చాల అవమానాలు జరిగినయ్. అది నేనె సరిచేద్దమనుకుంటున్న. కొన్నిదినాలయ్యాంక నేను నర్సింగ్ చేస్త. అయ్యాంక ఏదైన నన్నరిల చేరి రోగుల సేవకు నా జీవితం అర్పించుకొని చేసిన తప్పుకు దేవుని వద్ద కాలం గడుపుత."

ఇంతకాలం వున్న చంచల చిత్తం ఆ సంఘటన వల్ల దూరమై చాల దృఢనిశ్చయంతో తాననుకున్నది సాధించటానికి ముందడుగు వేసింది లూసీ. అంతటితో ఒక శకం ముగిసింది. అంతా సక్రమంగా వుంటే మంచి గాయని కావలసిన వ్యక్తి అంత చిన్న వయసులోనే విరాగిగా మారటం కొంత బాధ కలిగించినా తన జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేయటం హర్షించదగ్గ విషయమే అని సరిపెట్టుకున్నారు.

డిగ్రీ ఫైనల్ ఇయర్ విజయవంతంగా ముగిసింది. ముగ్గురు ఫస్ట్ క్లాస్ లో పాసయినారు. రేణుకకు ఇంకా మెడిసిన్ చదువు కొనసాగుతూనే వుంది.

స్నేహితురాళ్ళు తీరిగ్గా కూర్చొని ఫ్యూచర్ ప్లాన్స్ చర్చించుకోసాగారు. తరుణికి సమస్యే లేదు. తండ్రికి ఒక్కతే కూతురైనందున ఆయన వ్యాపారాలన్ని చూసుకొని ఒక వ్యాపారవేత్త అవాలని ఆమె చిన్ననాటి నుండి పెంచుకున్న కోరిక. అందుకే బిజినెస్ మేనెజిమెంట్ కోర్స్‌లో చేరటానికి నిర్ణయించుకున్నది. అదే మాట చెప్పింది.

"పూర్ణిమ నువ్వేం చేద్దామని అనుకుంటున్నావే?"

"ఏమోనే నాన్న ఏమంటారో? ఆయన ఆల్రెడి సంబంధాల వేటలో పడ్డారు. నాకైతే ఒక లైబ్రరీలో వుద్యోగం చేస్తూ తనివితీరా పుస్తకాలు చదువుకుంటూ కాలక్షేపం చేద్దామని వుంది. దానికోసం లైబ్రరీ సైన్స్ కోర్స్ లో చేరాలని వుంది. "

"ఏదో సామెత చెప్పినట్టుగా వుంది. ఎవడికో బాగా స్వీట్స్ ఇష్టమని స్వీట్ షాప్‌లో వుద్యోగంలో చేరాడట. ప్రతిరోజూ అన్నన్ని స్వీట్స్ చూసిచూసి వెగటేసి ఇంక జన్మలో స్వీట్ పేరెత్తితే ఒట్టట. అట్లా వుంటుంది నీ పుస్తకాల పిచ్చి." అందరూ నవ్వారు.

"కాని నాది మటుకు వెగటేసే అభిరుచి కాదు. చదివినకొద్దీ చదవాలనిపిస్తుందే తప్ప విసుగనిపించదనే నా అభిప్రాయం."

"మరి కుసుమా నీ సంగతేంటి?"

"కొన్ని రోజులు విశాఖపట్నంలో మా పెద్దబాబాయి ఇంటికి అక్కడి నుండి అత్తయ్యల ఇళ్ళకు వెళ్ళి వద్దామనుకుంటున్నాను. ఆ తరువాత ఏం చేయాలో నిర్ణయించుకుంటాను. కొన్నాళ్ళు ఏదైనా వుద్యోగం చేయాలని వుంది."

"ఇంకా నయం. మీ తాతయ్య నీకు ఇప్పుడే పెళ్ళిసంబంధాలు చూస్తున్నారు. అయినా వుద్యోగం చేయాల్సిన ఖర్మ నీకేంటే?"

నాలుగు రోజుల క్రితం జరిగిన ఒక సంఘటన ప్రభావం కుసుమ మీద బాగా పడింది.

తాతయ్య బామ్మా నిద్రపోతున్నారు. కుసుమకు కూడా నిద్ర పట్టబోతుండగా పిన్ని చిన్నాన్నల గొంతులు వినిపించాయి. వినటం సభ్యత కాదని తెలిసినా తన పేరు ప్రస్తావన వచ్చేటప్పటికి వినసాగింది. పిన్ని గొంతు కొంచం ఆవేశంగా ధ్వనిస్తున్నది.

"అయినా ఈ రొంపి ఎప్పుడూ వుండేదే కదండీ. ఒకటా రెండా దాదాపు ఏడెనిమిది సంవత్సరాలనుండి పడుతూనే వున్నాము. గుళ్ళో లింగాలాలే పాతుకు పోయినాము. మీకొచ్చే ఆ ఎల్టిసి కూడా నీళ్ళొదులుకోవలసి వస్తున్నది. అయినా మీ చిన్నన్నయ్య అక్కయ్యలు కుసుమను తీసుకొని అత్తయ్య మామయ్యగారిని ఏ సెలవలకైనా రమ్మని బ్రతిమిలాడుతూనే వున్నారు. కాని వీళ్ళే ఒప్పుకోవటం లేదు. కుసుమ కొత్త చోట్లల్లో ఇబ్బంది పడుతుందేమోనని భయపడుతూ వున్నారు. మన ఇంటికి వచ్చినప్పుడు దానికి ఇది కూడా కొత్త చోటేగా. కొన్నాళ్ళు అట్లా వస్తూ పోతూవుంటే అదే అలవాటవుతుంది.

ఏది ఏమైనా ఈ ఎండాకాలంమటుకు పిల్లలు ఎక్కడికైనా వెళ్ళాల్సిందేనని పట్టుపట్టి కూర్చున్నారు. పెద్దాడు వచ్చే ఏడు ఇంజనీరింగ్ లో చేరాడంటే ఇంక అసలే కుదరదు." ఎన్నడూ లేనిది పిన్ని అట్లా మాట్లాడుతూంటే కుసుమ తన చెవులను తానే నమ్మలేకపోయింది.

"సరేలే రేపు ఏ సంగతి చూద్దాము. పడుకో. అయినా కుసుమ వింటే బాధపడుతుంది."

కుసుమకు ఇంక నిద్ర కరువయింది. తనలోకి తనను చూసుకోవటం మొదలెట్టింది.

పిన్ని అన్న మాటలలో బాధ పడవలసినది ఏముంది? వున్న మాటే అన్నది.

తను ఎంత స్వార్ధపరురాలు! ఇన్నాళ్ళూ తన గురించే తను ఆలోచించుకున్నది. ఒకటి రెండు సార్లు పెద్దబాబాయి వచ్చి వాళ్ళతో విశాఖపట్నం రమ్మన్నాడు. అది తను బొంబాయి నుంచి వచ్చిన కొత్త. బామ్మ తాతయ్య నచ్చచెప్పచూసారు. అక్కడ కూడా నీ ఈడు అమ్మాయిలు వున్నారు. ఒకసారి పోయొద్దామని ఎంతో చెప్పారు. కాని తనే మూర్ఖురాలిలాగా ఏడుపు మొదలెట్టి నేనెక్కడికి రానని మొండికేసి కూఛుంది.

పాపం ముసలాళ్ళిద్దరు కూడా తన మూలకంగా ఎక్కడకూ వెళ్ళకుండా తననే కనిపెట్టుకొని వుండిపోయారు. పిన్ని బాబాయి తన మీద తక్కువ అభిమానం చూపించారా? తండ్రి నుండి వచ్చిన ఆస్తిలో చిల్లిగవ్వ కూడా ముట్టకుండా అంతా బాంక్ లోనే పెట్టి, తనను కూడా తమ బిడ్డలతో సమానంగా అన్ని ఖర్చులు భరిస్తూ ఇన్నాళ్ళూ ఎంతో ప్రేమగా చూసుకున్నారు.

ఇప్పుడు ఆలోచిస్తే అనిపిస్తున్నది. బాబాయి ఫామిలీతో ఇన్ని సంవత్సరాలు ఎక్కడికి వెళ్ళలేదంటే తానే కారణం. తనని కనిపెట్టుకొని తాతయ్య బామ్మ. పెద్దవాళ్ళను ఆడపిల్లను వదిలి  వాళ్ళు వూరు కదలకుండా ఎక్కడకు వెళ్ళలేదంటే వాళ్ళ మెడలకెంత గుదిబండలా మారిందో తలుచుకుంటే తనమీద తనకే అసహ్యం అనిపిస్తున్నది.

మరుసటి రోజు పొద్దున్నే బ్రేక్‌ఫాస్ట్ టేబిల్ వద్ద, "తాతయ్యా ఇన్నాళ్ళూ చదువులని పరిక్షలని ఎక్కడికి పోకుండా వుండిపోయాము. ఈ సంవత్సరం పెద్దబాబాయి వాళ్ళ వూరికి వెళ్ళొద్దామా? నాకు కూడా ఎన్నేళ్ళనుంచో వాళ్ళందరిని చూడాలనిపిస్తున్నది."

కుసుమ మాటలకు అందరూ ఆనందంగా చూసారు. బాబాయి పెద్దకొడుకు శ్యామ్, "అవును తాతయ్యా, ఈ ఏడు అందరమూ కలిసి విశాఖపట్నం వెళ్దాం. ఆ చుట్టుపక్కల చూడవలసిన ప్రదేశాలు కూడా చాలా వున్నాయి." హుషారుగా అన్నాడు.

అందరూ సరేనంటే సరేనన్నారు. బాబాయి ఆ ప్రయత్నంలో వున్నాడు.

"పిన్నీ, నాకు కాలేజీలో కొన్ని సర్టిఫికేట్లు తీసుకొనే పని వుంది. వెళ్ళొస్తాను."

అంతకు ముందర టిసి తెచ్చుకోవటానికి వెళ్ళినప్పుడు, క్లాస్‌మేట్స్ కొందరు కలిసారు. గ్లోరియా కూడా కనిపించింది. "హేయ్, బాంక్లో వేకెన్సీస్ వస్తున్నాయట. ఇప్పుడు అప్లైచేస్తే ఈజీగా జాబ్స్ దొరికే ఛాన్స్ వుందంట. మేమందరమూ అప్లై చేస్తున్నాము. ఒక ఎప్లికేషన్ ఫార్మ్ ఎక్స్‌ట్రా వుంది. మీకు ఎవరికైనా ఇంటరెస్ట్ వుంటే అప్లై చేయండే." అంటూ ఒక ఫార్మ్ చేతిలో పెట్టి వెళ్ళింది. అది ఇంకా తన దగ్గరే వుండిపోయింది.

ఆ నాడు ఇంటరెస్ట్ లేక పక్కన పడేసింది. రాత్రంతా ఆలోచించి, ఇంక తను ఒకరికి బరువు కాకూడదు. తన కాళ్ళమీద తను నిలబడాలని నిర్ణయానికి వచ్చి, పొద్దున్నే కూర్చొని ఫార్మ్ నింపింది.

అందరినుండి ప్రతిఘటన ఎదుర్కోవలసి వుంటుందని తెలుసు. ఇంకా ఆడపిల్లలు వుద్యోగాలకు అంతగా మొగ్గు చూపని సమాజం. కాని ఎలాగోలాగ ఒప్పించాలి అని దృఢ నిశ్చయంతో కాలేజీకి వెళ్ళి అవసరమైన సర్టిఫికేట్స్ తీసుకొని బాంకుకు వెళ్ళి ఎప్లికేషన్ ఇచ్చి వచ్చింది.

"అవును. తాతయ్య సంబంధాలు చూస్తున్నారని నాకు కూడా తెలుసు. కుదిరే వరకు వూరికే వుండకుండా ఏదైనా వుద్యోగం చేద్దామని అనిపిస్తున్నది. అయినా అనుకోగానే వుద్యోగాలు  అంత సులభంగా దొరుకుతాయా? మన క్లాస్‌మేట్స్ అందరూ అప్లై చేస్తూంటే నేను కూడా బాంకులో అప్లై చేసాను." నెమ్మదిగా చెప్పింది.

"అదేంటి కుసుమా? మెరిట్ వున్నదానివి. ఆ చేసేదేదో పిజి కి ట్రై చేయవచ్చు కదా? మేమొచ్చి తాతయ్యతో మాట్లాడమా?"

"లేదు తరుణి. ఆ డిస్కషన్ కూడా అయింది. మన వంటి మధ్య తరగతి అమ్మాయిలు ఇప్పుడిప్పుడే గ్రాడ్యుయేషన్ చేయటం మొదలైంది. తాతయ్య మాటలలో చెప్పాలంటే, గ్రాడ్యుయేట్  అమ్మాయికి ఏ పోస్ట్ గ్రాడ్యుయేట్ సంబంధమో చూడవచ్చు. అదే పిజి అమ్మాయికి సంబంధం చూడటం కష్టం. అంతగా అయితే పెళ్ళయిన తరువాత అత్తింటి వాళ్ళు ఒప్పుకుంటే అప్పుడే పై చదువులు చదవ వచ్చు అన్నారు. అది కూడా సబబేననిపించింది."

"మరి నువ్వుబాంక్ లో వుద్యోగానికి ప్రయత్నిస్తున్నావంటే ఒప్పుకుంటారా?"

"చూడాలి. ఒక వేళ నిజంగానే వుద్యోగం వస్తే  ఎట్లాగైనా వప్పించాలి."

అనుకున్నట్టుగానే కుసుమ వుద్యోగంలో చేరటానికి తాతయ్య బామ్మ ఎంతో ఆపటానికి ప్రయత్నం చేసారు.

"కుసుమా, నీకు వుద్యోగం చేయాల్సినంత అవసరం ఏంటమ్మా? మంచి సంబంధాలు ఎన్నో తటస్థపడ్డాయి. ఈ ఏడే ఏదో ఒకటి చూసి నిశ్చయం చేద్దామనుకుంటున్నాము."

"లేదు తాతయ్యా. నేను కూడా ఇట్లాగే వుండిపోతాననటం లేదుగా! ఏదైనా సంబంధం నిశ్చయమయ్యేదాకా చేస్తాను. ఒకవేళ వచ్చేవాళ్ళు ఒప్పుకుంటే కొనసాగిస్తాను. వద్దంటే మానేస్తాను. ఈ మాట ముందే మీరు కూడా వచ్చేవాళ్ళకు చెప్పండి. అయినా నేను కూడా డబ్బు కోసం కాదుగా చేయబోయేది? వూరికే ఇంట్లో కూర్చుంటే పిచ్చెక్కేటట్టున్నది." అంటూ పట్టుబట్టి బాంక్ లో చేరింది.

అట్లా ఏడాది గడిచింది. కుసుమ ఇంటి భాధ్యత చేపట్టింది. పిన్నికి పనిలో సాయం చేయటం, చెల్లెళ్ళకు తమ్ముడికి చదువులో సహాయం చేయటం, తాత బామ్మ అవసరాలు చూసుకోవటం వంటి భాధ్యతలన్ని నేర్పుగా చూసుకుంటూ వుండేటప్పటికి ఇంటి వాతావరణంలో మార్పు వచ్చి మళ్ళీ పూర్వపు ఆనందాలు తిరిగి వచ్చాయి.

"అమ్మా కుసుమా, మొన్న ఎండాకాలం పెద్ద బాబాయి ఇంటికి వెళ్ళినప్పుడు రామనవమి పందిట్లో మన వాళ్ళే ఒక కుటుంబం నిన్ను చూసారట. వాళ్ళ అబ్బాయి ఇంజనీర్. గవర్న్‌మెంట్ వుద్యోగం. అన్ని మనకనుకూలంగానేవున్నాయి. కాణీ కట్నం వద్దట. నీకిష్టమైతే నేను పెద్ద బాబాయి వెళ్ళి మాట్లాడి వస్తాము. ఇదిగో అబ్బాయి ఫోటో."

అప్పటికే కొన్ని సంబంధాలు చూడటం, వాళ్ళు కట్నాలడుగుతున్నారన్న నెపంతో రిజెక్ట్ చేయటం జరిగింది.

పేరుకు పెళ్ళి చూపులే కాని ఇంకా అమ్మాయి అబ్బాయిల అభిప్రాయాల మీద కాకుండా పెద్దల నిర్ణయాల మీదే సంబంధాలు నిశ్చయం చేసే రోజులు అవి. కాని కుసుమకు కొన్ని స్థిర నిర్ణయాలు వుండబట్టి తాతగారు ఆమెను కూడా సంప్రదిస్తూ వుంటారు.

ఫోటో చూసింది. ఇంజనీర్. గవర్న్‌మెంట్ వుద్యోగం. సాంప్రదాయమైన కుటుంబం. ఒక బావగారు ఆడబడుచు అత్త. అన్నిటికన్నా ముఖ్యంగా కట్నం ఆశ లేదు. పిల్లాడికెటువంటి వంక పెట్టేందుకు లేదు.

"ఆఁ చెప్పటం మరిచాను. నువ్వు పెళ్ళి తరువాత కూడా వుద్యోగం చేయటానికి కూడా ఒప్పుకున్నారు."

సంతోషంతో మనసు ఉప్పొంగిపోయింది. "సరే తాతయ్యా, బాబాయిలతో సంప్రదించి అందరికి బాగున్నదనిపిస్తే నాకేమీ అభ్యంతరం లేదు."

అంగరంగ వైభోగంగా కుసుమ పెళ్ళి జరిగిపోవటం, తరుణి కోరుకున్నట్టు బిజినెస్ స్కూల్లో చేరటం, పూర్ణిమకు కూడా త్వరలోనే సంబంధం కుదరటంతో పెళ్ళి చేసుకొని అక్కడితో ఆగకుండా ప్రైవేట్‌గా ఎం.ఎ తెలుగు చేసి భర్త ప్రోత్సాహంతో తన ఆశయానికి తగ్గట్టే లైబ్రరీ సైన్స్ లో డిగ్రీ సంపాదించి కాలేజీలో లైబ్రేరియన్‌గా స్థిరపడటం చకచక జరిగిపోయాయి.

రేణుక మెడిసిన్ తరువాత గైనకాలిజీలో పిజి కూడా చేసి స్వంతంగా నర్సింగ్ హోం పెట్టుకున్నది.

రోజులు వారాలగా, వారాలు నెలలగా, నెలలు సంవత్సరాలగా, ఆ తర్వాత దశాబ్దాలగా మారాయి. ఎవరి మటుకు వాళ్ళు స్థిరబడిపోయినారు. కాలగర్భంలో కలిసిన పైతరం, కొత్తగా మొలకెత్తిన కొత్త తరంతో మధ్యతరగతి మహిళ ఎన్నెన్నో మార్పులు చూస్తూ ఐదుతరాల అనుభవాలను చవి చూడటం జరిగింది. నాయనమ్మతాతయ్యల కాలం అమ్మనాన్నల కాలం అత్తగారింట భర్తతో జీవనం ఆ తరువాత పిల్లలు మనుమలు.

గేటు బయట సెక్యూరిటీ ఆపాడు. "ఎక్కడికి పోవాలి మాడం?"

"వారపత్రిక ఎడిటర్‌ను కలవాలి."

"అదిగో ఆ పక్కన ఎంట్రీ పాస్ ఇస్తారు. తీసుకోండి.

"నమస్తే మాడం. మాకు మీ నుంచి ఒక సహాయం కావాలి."

"చెప్పండి. నేను చేయదగ్గదైతే తప్పకుండా చేస్తాను." బెల్ కొట్టి ప్యూన్ను పిలిచి ముందర మంచినీళ్ళు తెమ్మని ఆ తర్వాత టీ తీసుకు రమ్మని పురమాయించి వచ్చిన వారివైపు ప్రశ్నార్థకంగా చూసింది వారపత్రిక ఎడిటర్.

"నా పేరు పూర్ణిమ. డిగ్రీ కాలేజీలో లైబ్రేరియన్ జాబ్ చేస్తున్నాను. ఈమె తరుణి. తరుణి ఇండస్ట్రీస్ ఓనర్."

"మిమ్మల్ని కలవటం చాల సంతోషంగా వుంది. నేను మీకేమి సహాయం చేయగలుగుతానో ........... "

తరుణి బాగ్ నుండి వారపత్రిక కాపీ తీసి టేబిల్ మీద పెట్టింది. "ఈ పత్రికలో "తోడొకరుండిన......." అన్న ఫీచర్లో ఒక కవితలాంటిది ప్రచురితమయింది. అది వ్రాసింది మా ఫ్రెండ్ అని మాకు చాల నమ్మకం. తను మారుపేరుతో వ్రాసింది. మేము తన కోసం చాల సంవత్సరాలగా వెతుకుతూ ఆచూకీ తెలియక బాధ పడుతున్నాము. మీ దగ్గర రచనలు చేసిన వారి అసలు పేరు ఏడ్రెస్లు వుంటాయి కదా, మీకు అభ్యంతరం లేకపోతే మాకు ఆమె ఎడ్రెస్ ఇవ్వగలతారా?"

వచ్చిన వాళ్ళు మర్యాదస్తులు. మంచి పదవులలో వున్న వారు. కాని రచయితల అనుమతి లేందే వారి ఎడ్రెస్ పరాయి వాళ్ళకు ఇవ్వటం రూల్స్‌కు వ్యతిరేకం. అదే మాట అతిధులకు కూడా వివరించింది.

"ఒక్కసారి ఆమె వ్రాసిన రాత చదవండి. మీకే అర్థమవుతుంది. అది ఆషామాషీగా కాలక్షేపం కోసం వ్రాయలేదు. ఆ రాతలో ఒక పర్పస్ వుంది. మీకు ఇంకా రుజువులు కావాలంటే కూడా చూపిస్తాము. కింద రాసిన "పూతరేకు" అన్న కలం పేరులోనే మాకు సందేశం ఇచ్చింది. మేము నలుగురం ఫ్రెండ్స్. పూర్ణిమ తరుణి రేణుక కుసుమ. మా పేర్లలో మొదటి అక్షరాలు కలిపి మమ్మల్ని పూతరేకు అనే వారు. మీరు కావాలంటే ఆమె ఎడ్రెస్ తీసి చూడండి. ఒరిజినల్ నేం కుసుమ అని వుంటేనే మాకు వివరాలు చెప్పండి. లేకపోతే చెప్పేయండి. మేము వెళ్ళిపోతాము."

ఒక్క నిమిషం ఆలోచించింది ఆవిడ. నిజమే. చదవంగానే ఆ కవితను చెత్తబుట్టలో పడేయబోయింది. కాని మళ్ళీ ఇంకొకసారి చదివేటప్పటికి ఏదో వ్యధతో కూడిన సందేశం వున్నట్టు అనిపించి ప్రచురణకు స్వీకరించింది.

అంత వివరంగా మాట్లాడిన పూర్ణిమ మాటలకు ఆవిడ కన్విన్స్ అయినట్టు కనిపించి బెల్ నొక్కి వచ్చిన వ్యక్తికి ఇన్స్ట్రక్షన్స్ ఇచ్చి ఫైల్ తెప్పించింది. ఓపెన్ చేసి చూసిన ఆవిడ ముఖం విప్పారింది.

"మీరు చెప్పినట్టే ఆవిడ పేరు కుసుమ. ఇందులో ఎడ్రెస్ తప్ప ఫోన్ నంబర్ ఏదీ లేదు. వుందుంటే ఆమెతో పర్సనల్‌గా మాట్లాడి ఎడ్రెస్ ఇచ్చేదాన్ని. కాని ఇప్పుడు ఆ అవకాశం లేదు. మీరు ఇంతగా చెప్పుతున్న తరువాత కాదనలేకపోతున్నాను. మీ విజిటింగ్ కార్డ్ ఏదైనా వుంటే ఇవ్వగలుగుతారా?"

వెంటనే తరుణి తన కంపెనీ బానర్ మీద వున్న ఫొటో ఐడెంటిటి చూపించి కార్డ్ ఫోన్ నంబర్లన్ని ఇచ్చింది.

"థాంక్యూ మాడం. మీ మేలు ఎన్నటికీ మరిచిపోలేము. దాదాపు ముప్ఫై సంవత్సరాల అనంతరం మేము మా ఫ్రెండ్ని కలవబోతున్నామంటే ఆ పుణ్యమంతా మీకే."

ఆవిడ ఆ కాంప్లిమెంట్ చిరునవ్వుతో స్వీకరించింది.

"రేణూ సక్సెస్. కుసుమ ఎడ్రెస్ దొరికింది. నువ్వు ఎంత తొందరగా ఫ్రీ అవుతావో చెప్పు. వెంటనే వెళ్ళి తనని కలవాలన్నంత ఆరాటంగా వుంది." పత్రిక ఆఫీస్ ముందు నుంచే రేణుక మొబైల్ మీద ఫోన్ చేసి మాట్లాడింది పూర్ణిమ.

"అవునా! నేను ఫ్రీనే. ఎప్పుడైనా రావచ్చు. ఎక్కడ కలవాలో చెప్పు. నేను అక్కడకు రావటమో, మీరు నన్ను పికప్ చేసుకుంటారో ప్లాన్ చేద్దాం."

సాయంత్రం షుమారు ఆరవుతున్నది. ఆఫీసుల నుండి ఇళ్ళు చేరే వారితో రోడ్లన్ని రద్దీగా వున్నాయి.

"అబ్బ ఇంత దూరంలో ఎక్కడ దొరికిందో వీళ్ళకు ఇల్లు?" అనుకుంటూనే డ్రైవ్ చేయసాగింది తరుణి. దారిలోనే రేణుకను నర్సింగ్ హోం నుండి పికప్ చేసుకొని, డ్రైవర్ను పంపించేసి బయల్దేరారు ముగ్గురూ.

వూరికి ఇరవై కిలోమీటర్ల దూరంలో అదొక పాష్ కాలనీలో గేటెడ్ కమ్యూనిటీ.

"ఎవరు కావాలండి?" గుమ్మంలో నిలబడ్డ యువతి అడిగింది.

ఏదో చెప్పబోయిన తరుణిని వారించి, "ఇక్కడ పూతరేకులు దొరుకుతాయని చెప్పారు. వాటి కోసం వచ్చాం." పూర్ణిమ అడిగింది.

ఒక్క క్షణం నోటమాట లేకుండా నిలబడ్డ కుసుమ, ఒక్కసారి, "పూర్ణిమా!" అంటూ అరిచి అమాంతం వాటేసుకుంది. ఆమెను వదిలి వెనకే వున్న తరుణిని రేణుకను గుర్తు పట్టి అందరిని ఒక్కసారే చేతులతో చుట్టేసింది. ఆనందంతో కళ్ళల్లోనీళ్ళు తప్ప ఎవరికి నోటెంబడ మాట రావటల్లేదు.

పూర్ణిమే ముందర తేరుకొని, "ఇంత కష్టపడి నిన్ను వెతుక్కుంటూ వస్తే, ఇక్కడి నుండే వెళ్ళగొట్టేస్తావా ఏంటీ. లోపలికి రావాలా వద్దా?"

తాము చూసిన పూర్ణిమకు ఈ నాటి పూర్ణిమకు ఎంత మార్పు. ఆ చెవి కింద పెసరబద్దంత పుట్టుమచ్చ ఒక్కటే చెక్కు చెదరకుండా వుంది. ఎడ్రెస్ వెతుక్కుంటూ రాబట్టి అది కుసుమ అని తెలుస్తూ వుంది.

కళ్ళ కింద నల్ల వలయాలు, చిన్నప్పటి అందమంతా ఏమయిందో ఎమో!

అక్కడే ఫ్రిజ్, పక్కనే డైనింగ్ టేబిల్ మీద గ్లాసులు కనిపించాయి. రేణుక లేచి తనొక గ్లాసు తీసుకొని అందరికి తలొక గ్లాస్ మంచి నీళ్ళు అందించింది.

"నా మతి మండా మిమ్మల్ని ఒక్కసారి చూసిన మైమరపులో మంచి నీళ్ళు ఇద్దామని కూడా అనిపించలేదు చూసారా!"

"ఎన్నాళ్ళయిందే మిమ్మల్ని చూసి?" కళ్ళల్లో నీళ్ళు ఆరటం లేదు.

ఇంకా వాళ్ళు సంభాషణే మొదలెట్టలేదు. బైట కాలింగ్ బెల్ మోగింది. చటుక్కున లేచింది కుసుమ. కళ్ళల్లో ఏదో బెరుకు స్పష్టంగా కనిపిస్తూవుంది. తలుపు తెరిచి "ఓ, మీరేనా? ఇవాళ అప్పుడే వచ్చారే?" అంటూ పక్కకు తప్పుకుంది.

ఒక యువతీ యువకుడు లోపలికి వచ్చారు.

"నా కొడుకు కోడలు." అని ఫ్రెండ్స్‌కు చెప్పి,

"సందీప్, మానసా, వీరు ముగ్గురు నా చిన్నప్పటి ఫ్రెండ్స్."అంటూ పేరు పేరునా పరిచయం చేసింది.

"హలో ఆంటీ. అమ్మకు బాంక్ కొలీగ్స్ కాక ఇంతమంది చిన్ననాటి ఫ్రెండ్స్ వున్నట్టుగా ఎప్పుడూ చెప్పనే లేదు. ఎనీవే నైస్ టు మీట్ యూ ఆల్." చాల మర్యాదగా పలుకరించి, "ఒకే ఆంటి కారీ ఆన్. మీరు మాట్లాడుకుంటూ వుండండి." అంటూ లోపలికి వెళ్ళిపోయినాడు.

కోడలు మానస కూడా అదే విధంగా పలుకరించి, వారికి కాఫీలు స్నాక్స్ ఏర్పాటు చేసే పనిలో మునిగిపోయింది.

కొడుకు కోడలు అనుకూలంగానే వున్నారు. బాగ ఆప్యాయతలు తెలిసిన వాళ్ళే. మరి కుసుమ సమస్య ఏంటో? అందరి మనసుల్లో అదే ఆలోచన.

భర్త ఎక్కడున్నాడో? అతను ఎటువంటివాడో?

అయినా కలవంగానే అన్ని ఆరాలు తీస్తే బాగుంటుందా!

చూడబోతే ఏదో అభద్రతా భావం కనిపిస్తున్నది. మాటిమాటికి వాకిలి వైపు చూస్తున్నది. ఏదో పొడిపొడిగా మాట్లాడటం తప్ప మనసు విప్పి మాట్లాడేటట్టు లేదు.

కొడుకు కోడలు కూడా సరదాగా కబుర్లు చెప్పటం మొదలెట్టారు. చాలా ఫ్రెండ్లీ నేచర్. సాధారణంగా స్నేహితులు మాట్లాడుతున్నట్టే వాళ్ళ చదువులు, వుద్యోగాలు, పిల్లల చదువులు, ఈ విషయాలే మాట్లాడుకున్నారు. ఈ లోగా ఆటలకెళ్ళిన సందీప్ ఇద్దరు పిల్లలు వచ్చారు. వాతావరణం ఎంతో రమ్యంగా వున్నది.

దాదాపు ఒకగంటసేపు కూర్చున్న తరువాత ఇంక బయల్దేరుదామని లేచారు.

"కుసుమా, మనమందరమూ కలిసి చాల రోజులయింది. రేణుక పూర్ణిమ కూడా వస్తారు. అందరమూ సరదాగా రెండు రోజులు గడుపుదాము. నీకు కూడా వీలైతే రేపు మా ఇంటికి వస్తావా?"

కుసుమ మొహంలో కొద్దిగా కాంతి వచ్చింది. కాని సమాధానం చెప్పటానికి తటపటాయిస్తున్నట్టు కనిపించింది.

అది గమనించిన తరుణి లీడ్ తీసుకొని సందీప్ తో చెప్పింది. "సందీప్, చాల ఏళ్ళ తరువాత మేము కలుస్తున్నాము. చిన్నప్పుడు నలుగురము ఒక ఇంట్లోనే కలిసి కాలక్షేపం చేసేవాళ్ళం.  కుసుమను మాతో తీసుకొని వెళ్ళి రెండు రోజులు కాలక్షేపం చేద్దామనుకుంటున్నాము."

"అదేంటి ఆంటీ, మాకేదైనా కావాలంటే అమ్మ అనుమతి కావాలి. ఆమెను అడగకుండా ఏపని చేయము. అటువంటిది  అమ్మ విషయం  నన్ను అడగటం ఏమిటి? ఏంటమ్మా, ఆంటీ ఏదో అడుగుతున్నారు." నవ్వుతూ కుసుమను అడిగాడు.

"అయినా రేపటిదాకా ఎందుకు? రేపు నాకు అర్జెంట్ పని వుంది. వచ్చి దిగబెట్టటానికి వీలుపడక పోవచ్చు. మీరెవరైనా మళ్ళీ ఇంత దూరం రావాలంటే ఇబ్బంది. అమ్మకు అభ్యంతరం లేకపోతే ఇప్పుడే మీతోనే తీసుకెళ్ళండి. ఎలాగా రేపు సెకండ్ సాటర్డే. మీరూ వుద్యోగులే కాబట్టి వీకెండ్ ఎంజాయ్ చేయవచ్చు."

"అవును ఆమాటా నిజమే. తరుణీ ఒక్క పది నిమిషాలు ఆగుతే నే వెళ్ళి నా బాగ్ సర్దుకొని వస్తాను." ఆనందంగా మేడమీదకు వెళ్ళింది.

సందీప్ మానస ఫ్రెండ్స్ తో కబుర్లలో పడ్డారు.

"అవును సందీప్,  నాన్నగారు ఏరీ కనబడరే? బయటకు వెళ్ళారా?"

కొద్దిగా ఇబ్బందిగా కదిలాడు. మానస కలుగజేసుకొని, "అవునాంటీ మామయ్యగారు మొన్ననే వాళ్ళ అన్నగారింటికి విశాఖపట్నం వెళ్ళారు. మర్రెండు రోజుల్లో వస్తారు. ఆ పాటికి అత్తయ్యగారు వచ్చేస్తే సరిపోతుంది. అయినా మీ ఫోన్ నంబర్ ఇవ్వండి. మామయ్యగారు ఎప్పుడొచ్చేదీ నే ఫోన్ చేస్తాను." గలగల మాట్లాడేసింది.

"సందీప్ మానసా, నేను బయల్దేరుతున్నాను. ఏదైనా అవసరముంటే నా మొబైల్‌కు ఫోన్ చేయండి."

**(కొనసాగింపు వచ్చేనెలలో)**

Post your comments